# 1951 Program Document of Communist Party of India

From Documents of the History of the Communist Party of India
Vol VIII 1951-1956
Edited by Mohit Sen
People's Publishing House New Delhi, Oct 1977
Pages 1 to 18.

## భారత కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమం 1951

భారత కమ్యూనిస్టు పార్టీ చరిత్ర పత్రాలనుండి
సంపుటి viii 1951-1956

సంపాదకత్వం: మోహిత్ సేన్

ప్యూపుల్స్ పబ్లిషింగ్ హౌస్ న్యూ డెల్హీ , ఆక్టోబరు 1977

పేజీ 1 నుండి 18 వరకు

అనువాదం: యార్లగడ్డ వెంకట రావు

xxxxx

# అనువాదకుని మాట

నేడు భారత కమ్యూనిస్టు ఉద్యమం అనేక పాయలుగా చీలి భారత దేశ రాజకీయాలను ఏ మాత్రమూ ప్రభావితం చేయలేని దశకు చేరుకున్నది. ఈ దుర్దశకు కారణాలు ఏమిటి అన్నది లోతుగా అధ్యయనం చేయవలసి ఉంది. కానీ విచారకరమైన విషయం ఏమిటంటే కమ్యూనిస్టు శ్రేణులలో అత్యధిక భాగంలో సిద్ధాంత అధ్యయనం కొరవడింది. ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమ, భారత కమ్యూనిస్టు ఉద్యమాల గత చరిత్ర గురించిన అధ్యయనం అయితే చాలా అధమ స్థాయిలో ఉన్నది. తత్ఫలితంగా కమ్యూనిస్టు పార్టీల శ్రేణులలో అన్య వర్గ ధోరణులు ప్రబలి, అస్తిత్వ వాదం వైపు, స్త్రీవాదం వైపు, కుల, మత, ప్రాంతీయ వాదాలవైపు కొట్టుకుని పోతున్నాయి. పదవీ వ్యామోహం, భోగలాలసత్వం, వినిమయ తత్వం పెచ్చరిల్లాయి. దీనిని నుండి బయటపడి భారత కమ్యూనిస్టు ఉద్యమం గత వైభవాన్ని తిరిగి పొందాలంటే భారత కమ్యూనిస్టు ఉద్యమ గత చరిత్రనంతా 'నేను కమ్యూనిస్టును అని భావించే ప్రతి ఒక్కరూ' అధ్యయనం చేయాలి. కమ్యూనిస్టు ఉద్యమం మార్క్సిజం-లెనినిజం కు, కేంద్రీకృత ప్రజాస్వామిక సూత్రానికి కట్టుబడి పని చేసే ఐక్య కమ్యూనిస్టు పార్టీ దిశగా పయనించడం అవసరం. అందుకోసం నవ శకం ప్రచురణల సంస్థ తన వంతు కృషిగా తన శక్తి మేరకు గత చరిత్రను కమ్యూనిస్టు శ్రేణులకు అందించే ప్రయత్నం చేస్తున్నది. అందులో భాగమే భారత కమ్యూనిస్టు పార్టీ 1951 లో ఆమోదించిన మొట్ట మొదటి పార్టీ కార్యక్రమాన్ని తెనుగులో అనువదించి మీ ముందుకు తెస్తున్నది. ఈ కార్యక్రమానికి నేపధ్యం అయిన భారత కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు మాస్కోలో సోవియట్ నాయకులతో జరిపిన చర్చలను సంపూర్ణంగా ముద్రించి మీ ముందుకు గత సంవత్సరంలో తీసుకు వచ్చింది నవ శకం ప్రచురణలు.

భారత కమ్యూనిస్టు ఉద్యమం ఇన్ని పాయలుగా చీలడానికి నేపథ్యంగా ఉన్న భౌతిక, రాజకీయ కారణాలను కొంత మేరకు పరిచయం చేసే ప్రయత్నం ఈ దిగువన చేస్తున్నాను:

భారత కమ్యూనిస్టు పార్టీ ప్రథమ శాఖ తాష్కెంటు లో స్థాపించబడిన నాటి నుండే బ్రిటిష్ సామ్రాజ్యవాద పాలకుల అణచివేతలకూ, తదనంతరం దేశానికి రాజకీయ స్వాతంత్ర్యం వచ్చిననాటినుండీ పాలకవర్గాల అణచివేతలకు గురవుతూనే ఉంది. ఈ నిర్బంధాల కారణంగా మొదటి శాఖ ఏర్పడిన 1920 లగాయతు 1942 -43 మొదటి మహాసభ జరిగే వరకూ ఒక ఏకీకృత కార్యక్రమమూ, కేంద్రీకృత పార్టీ వ్యవస్థా లేకుండానే సుదీర్ఘ కాలం పాటు అక్టోబరు విప్లవ స్ఫూర్తితో పని చేస్తున్న స్వాతంత్ర్య శాఖల సమాహారంగా పనిచేస్తూ వచ్చారు. అశేష త్యాగాలు చేశారు. త్యాగాలకు తగిన గుర్తింపు కూడా దేశ వ్యాపితంగా కమ్యూనిస్టు ఉద్యమం పొందింది. ఈ నేపథ్యం కమ్యూనిస్టు ఉద్యమంలో ఫెడరల్ ధోరణులు తలెత్తడానికి దోహదం చేసింది. మొదటి మహా సభ జరిగి ఒక కేంద్రీకృత వ్యవస్థతో పార్టీ నిర్మాణ రూపం దిద్దుకునే సమయానికే ఉద్యమంలో మూడు ప్రధాన ధోరణులు వేళ్లూనుకున్నాయి. అవి a) జోషి నాయకత్వం లోని మితవాదం b) రణదివే, అధికారి, భవానీ సేన్ ల నేతృత్వం లోని (టిటోవాదం లేదా ట్రాట్స్కి వాదం) c) ఆంధ్రా థీసిస్ గా పేరుగాంచిన రైతాంగ పోరాట పంథా. ఈ మూడు ధోరణులను అనుసరించే వారి మధ్య ఏకాభిప్రాయం లేమి కారణంగా మొదటి మహాసభ కాలం నుండే వీరి మధ్య ఘర్షణ కొనసాగింది, అంటూ పొంతూ లేని చర్చలు వాగ్వాదాలు కొనసాగి 1951 నాటికి ఏకాభిప్రాయం రాణి కారణంగా సోవియట్ కమ్యూనిస్టు పార్టీ ప్రత్యేకించి కామ్రేడ్ స్టాలిన్ సలహా తీసుకోవాలనే నిర్ణయానికి వచ్చి కామ్రేడ్లు చంద్ర రాజేశ్వర రావు, మాకినేని బసవ పున్నయ్య, అజయ్ ఘోష, శ్రీపాద అమృత డాంగేలతో కూడిన కేంద్ర కమిటీ ప్రతినిధుల బృందం మాస్కో చేరుకుని 1951 ఫిబ్రవరి, మార్చి

నెలలలో చర్చలు జరిపింది. ఈ చర్చల  పూర్తి పాఠాన్ని నవశకం ప్రచురణలు   పుస్తక రూపంలో తెచ్చింది. ఈ చర్చల సందర్భంలో మీ ఆదేశాలను పాటిస్తాము అని భారత కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధులు చెప్పగా మేము సలహాలు, సూచనలు మాత్రమే ఇస్తున్నాము, మీ దేశ నిర్దిష్ట పరిస్థితులకు అనుగుణంగా మీ నిర్ణయాలు మీరు తీసుకోండి అని కామ్రేడ్ స్టాలిన్ చెప్పారు. చర్చల అనంతరం ఒక ముసాయిదా కార్యక్రమాన్ని తయారు చేసి రష్యా కామ్రేడ్లకు సమర్పించి వారు సూచించిన సవరణలను స్వీకరించి, సవరించిన ప్రతిని 1951 అక్టోబరులో జరిగిన కలకత్తా మహాసభలో పార్టీ ఆమోదించడం జరిగినది. మాస్కో చర్చలు ముగింపు తర్వాత తమ లోపాలు ఏమిటో, తెలుసుకున్నామని, ఇప్పుడు తమ మధ్య   విభేదాలు లేవని, తిరిగి భారత దేశం వెళ్ళిన తర్వాత ఎవరి వాదన ఎంత శాతం సరైనది, ఎంత శాతం తప్పు, వంటి చర్చలు మరలా చేయమని, అందరం ఐక్యంగా కమ్యూనిస్టు పార్టీని, ఉద్యమాన్ని ముందుకు తీసుకు వెళతామని రష్యా కామ్రేడ్లకు భారత ప్రతినిధి బృందం  హామీ ఇచ్చి వచ్చింది. ఇచ్చిన హామీ మేరకు కార్యక్రమాన్ని అయితే ఆమోదించారు కానీ ఈ మూడు ధోరణుల వారు ఎవ్వరూ కూడా వారి వారి అవగాహనకు పూర్తిగా  అనుగుణంగా లేని కారణంగా ఈ కార్యక్రమంతో సంతృప్తి చెందలేదు. ఆ కారణంగా ఆమోదించిన ఈ కార్యక్రమాన్ని ఒక నిర్దిష్ట కాలం పాటు ఆచరణలో పెట్టి అమలు చేసి లాభ నష్టాలను బేరీజు చేయకుండానే 1956 లో ఈ కార్య క్రమాన్ని కాలం చెల్లిందిగా ఈ మూడు ధోరణుల వారూ ఏక కంఠంతో తీర్మానించారు కానీ కొత్త కార్యక్రమాన్ని ఆమోదించడంలో అప్పటి నుండి 1964 వరకు ఒక అవగాహనకు రాలేక పోయారు. దాని ఫలితంగా 1964 లో పార్టీ రెండుగా చీలిపోయింది. మితవాద వర్గం సి. పి. ఐ. లో ఉండి కృశ్చేవ్ రివిజనిజాన్ని బుజానకెత్తుకోగా, మిగిలిన రెండు ధోరణుల వారు కలిసి 1964 లో ఒక కార్యక్రమాన్ని ఆమోదిస్తూ, 1951 నాటి కార్యక్రమం లోని ఎత్తుగడల  పంథాను యథాతథంగా  స్వీకరించి సి. పి. ఐ. (ఎం ) గా ఏర్పడ్డారు. 1964 నుండి 1967

వరకు నిర్బంధాలు, జైళ్ళు సి. పి. ఐ.(ఎం) వారిని వెంటాడగా 1967 ఎన్నికలలో బెంగాల్, కేరళ రాష్ట్రాలలో అతిపెద్ద పార్టీగా సి. పి. ఐ.(ఎం) ఆవిర్భవించింది. ఐక్య సంఘటన ప్రభుత్వాలలో భాగస్వామ్యం వహించింది. ఐక్య సంఘటన ప్రభుత్వాలలో పాల్గొంటున్నప్పుడు పార్టీకి గల పరిమిత అవకాశాలను గుర్తించని, ఆంధ్రా థీసిస్ కు, మావో ఆలోచనా విధానాలకు అనుకూలురుగా ముద్రపడిన ఒక ధోరణి వారు 1969 ప్రాంతంలో సి. పి. ఐ.(ఎం) నుండి విడిపోయి మార్క్సిస్టు లెనినిస్టు పార్టీగా ప్రకటించుకున్నారు. ఈ ధోరణి గల వారిలో ఫెడరల్ ధోరణులు మితిమీరి నేడు అనేక చిన్న సమూహాలుగా చీలిపోయి, ఎవరికీ వారే తాము అసలైన మార్క్సిస్టు లెనినిస్టులము అని ప్రకటించుకుంటూ ఇతరులను రివిజనిస్టులనో, విప్లవ ద్రోహులనో నిందించుకుంటున్నారు.

నేడు ఈ అన్ని పార్టీల శ్రేణుల్లోనూ అధ్యయనం పూర్తిగా లోపించింది. భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర, ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర అధ్యయన అనివార్యం. అధ్యయనం ద్వారా, తమ గత అనుభవాలను పరిగణన లోకి తీసుకుని, తమ బలాన్ని, తమ లోపాలను, బలహీనతలను గమనించి వాటిని దిద్దుకుంటూ, ఇతరుల బలాన్ని, లోపాలను, బలహీనతలను అర్థం చేసుకుని వారితో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ ఒక కనీస కార్యక్రమం గల ఐక్య సంఘటనగానైనా ఏర్పడి ముంచుకొస్తున్న ఫాసిస్టు శక్తుల పురోగమనాన్ని అడ్డుకోవాలి.

ఇదే తమను తాము కమ్యూనిస్టులుగా భావిస్తున్న ప్రతి ఒక్కరి ముందూ ఉన్న కర్తవ్యం.

అందులో భాగంగా 195 1 నాటి భారత పార్టీ కార్యక్రమాన్ని అధ్యయనం కోసం మీ ముందు ఉంచుతున్నాను.

యార్లగడ్డ వెంకట రావు.

# భారత కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమం 1951

1951లో ఏప్రియల్‌లో పోలిట్ బ్యూరో ప్రకటించిన ముసాయిదాను సవరించి, ఈ కార్యక్రమాన్ని 1951 అక్టోబరు 9 -15 ల మధ్య కాలంలో కలకత్తాలో జరిగిన అఖిల భారత పార్టీ మహాసభ ఆమోదించింది. ఇది 1951 అక్టోబరులో ప్రచురించబడింది. పునర్ముద్రణ మార్చి 1953లో జరిగింది. 1953 డిసెంబరు 27 నుండి 1954 జనవరి 4 వరకు మధురైలో జరిగిన మూడవ పార్టీ మహాసభలో ఈ కార్యక్రమాన్ని పేరా 29లో ఒక సవరణ చేసి (మరలా ఆమోదించింది) పునరామోదించింది. దీనిని 1954 మార్చిలో ప్రచురించారు.

1. 1947 ఆగస్టులో బ్రిటిష్ సామ్రాజ్యవాద భారత పాలకులు డిల్లీలో భారత జాతీయ కాంగ్రెస్ నాయకత్వాన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పుడు, అసహ్యానికి గురైన బ్రిటిష్ వైస్రాయ్, గవర్నర్లు దేశం నుండి వెళ్లిపోయారు. విదేశీ సామ్రాజ్యవాద పాలన అంతమైందని, భారత దేశం స్వాతంత్ర్యాన్ని, స్వేచ్ఛను సాధించిందని, ఇప్పుడు ప్రభుత్వమూ, ప్రజలూ మన భూ వనరులు, శ్రమ ; మన ఫ్యాక్టరీలు, వర్కు షాపులు; మన అపారమైన సహజ సంపద, మానవ శక్తితో కోట్లాది మంది మన దేశ స్త్రీ, పురుషులకు సంతోషకరమైన జీవితాన్ని మన ప్రభుత్వం, ప్రజలు అందించగలరని భారత ప్రజలను నమ్మించారు.
2. నాలుగు సంవత్సరాల నెహ్రూ పాలన ప్రతి విషయం లోనూ జనాల ఆశయాలను వమ్ము చేసింది. ప్రజల వీరోచిత పోరాటాల ద్వారా అధికారంలోకి వచ్చిన భారత జాతీయ కాంగ్రెస్ ప్రభుత్వం, పరాన్నజీవులైన భూస్వాముల, శతాబ్దాల పాటు విదేశీ దురాక్రమణదారులను సమర్థించిన, వారితో కలిసి ప్రజలను, మన దేశాన్ని దోచుకున్న భారత దేశంలోని సంస్థానాధీశుల సంపద రక్షణకు, సంరక్షణకు అంకితమైన, ప్రతిజ్ఞ చేసిన ప్రభుత్వమని

నిర్ణయానికి తీసుకు రావడానికి వారి ఈ అనుభవం దోహదపడింది. భారత దేశం లోని విదేశీ బ్రిటిష్ మూలధన పెట్టుబడుల రక్షణకు, పరిరక్షణకు ప్రతిజ్ఞ చేసిన ప్రభుత్వం కావున భారత జాతీయ కాంగ్రెస్ ప్రభుత్వం బ్రిటిష్ సామ్రాజ్యవాదం అనుమతితో స్థాపించబడిందని అనుభవంలో వారు తెలుసుకోవటానికి దారితీసింది. జనజీవనం లోని ప్రతి రంగం లోనూ ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైంది. ప్రజలను ఫణంగా పెట్టి భూస్వాములూ, లాభార్జన పరులూ తమను తాము మరింత సంపన్నవంతులను చేసుకోగా, జనజీవనం అధ్వాన్నంగా మారింది.

3. నిజవేతనం పతనం, పెరుగుతున్న ధరల, పెట్టుబడిదారీ హేతుబద్ధీకరణ (రేషనలైజేషన్), నిరుద్యోగాలతో మన (ఫ్యాక్టరీలను, రైల్వేలను, మైన్లను, షిప్ యార్డులను, ప్లాంటేషన్లను) కర్మాగారాలను, రైల్వేలను, గనులను, తోటలను తదితరాలను నిర్వహిస్తున్న 50 లక్షల కార్మికులు బాధపడుతున్నారు. మెరుగైన వేతనాలు, పని పరిస్థితుల కొరకు వారు చేసే పోరాటాలు పోలీసే భీభత్సం, కాల్పులతో రక్తపుటేర్లలో ముంచబడ్డాయి. ప్రభుత్వం, దాని తాబేదారులచే పోరాడుతున్న వారి కార్మిక సంఘాలు విచ్ఛిన్నం చేయబడ్డాయి, చీల్చబడ్డాయి, అణచివేయ బడ్డాయి. ప్రజలకోసం ఉత్పత్తిని పెంచాలని డిమాండు చేసి ప్రభుత్వం అధ్వాన్నమైన పని పరిస్థితులను కార్మికులపై రుద్దుతున్నది. లాభార్జనపరులు లాభాలను పెంచుకోడానికి వీలు కల్పిస్తున్నది.

4. మన ప్రజలలో 80 శాతంగా ఉన్న లక్షలాది మంది రైతులు గతంలో లాగానే అణచివేయబడ్డారు. భూమి వుండి సాగు చేయగలవారి శ్రమను భూస్వాములు, వడ్డీ వ్యాపారులు, అధిక కౌళ్ళు, వడ్డీల ద్వారానూ, పెట్టుబడిదారీ మార్కెట్ కుయుక్తుల

ద్వారానూ, ప్రభుత్వ పన్నుల ద్వారానూ దోపిడీ చేస్తున్నారు. కానీ నాల్గింటి మూడు వంతుల రైతులకు స్వంత భూమి అంటూ ఏదీ లేదు. "భూమి లేని, పని దొరకని వారు శాశ్వత పేదరికంలో దుర్భరంగా జీవిస్తున్నారు. పని దొరుకుతున్న వారు, వారికి కుటుంబానికి జీవనాధారమైన వేతనం కూడా దొరకని పరిస్థితిలో, భూస్వాముల, షావుకారుల (వడ్డీ వ్యాపారుల) ఎస్టేట్లలో వ్యవసాయ కార్మికులుగా లేదా పేద కౌలుదార్లుగా దాసులుగా, బానిసలుగా పనిచేయాలి. దాని ఫలితంగా ఆహార పదార్థాల, పారిశ్రామిక ముడి సరకుల ఉత్పత్తి పడిపోతోంది, దేశంలో అత్యంత ఘోరమైన ఆహార సంక్షోభానికి దారి తీస్తోంది, లక్షలాది మందిని ఆకలి చావులకు గురి చేస్తోంది. భూస్వాములూ, లాభాపేక్షాపరులు నడుపుతున్న ప్రభుత్వం భూసంస్కరణలను గురించి గొప్పలు చెబుతూ, రైతుల శ్రమ నుండి రాజ్యం ద్వారా తమ కౌళ్ళను పరోక్షంగా పొందడానికి వీలుగా ప్రజలను పీడించేవారికి లక్షలాది రూపాయలను నష్టపరిహారంగా ఇచ్చే పతకాలను మాత్రమే అది రూపొందిస్తుంది. భూమికోసం, కౌళ్ళ, వడ్డీల, పన్నుల తగ్గింపు కోసం జరుపుతున్న పోరాటం రక్తపుటేర్లలో ముంచబడింది, కార్మిక వర్గ పోరాటాలు, సంస్థలతో పాటు వారి సంస్థలు నాశనం చేయబడ్డాయి. రైతులు, వ్యవసాయ కార్మికులు భూమికోసం, కౌళ్ళు, వడ్డీలు తగ్గించమని, వేతనాలు పెంచమని, మంచి జీవన పరిస్థితులు కల్పించమని అడిగే ధైర్యం చేసినందుకు, మొత్తం గ్రామాలు,తాలూకాలు, జిల్లాలు సైనిక, పోలీసు ఆక్రమణకు అప్పగించబడ్డాయి.

5. పట్టణాలలోని మధ్య తరగతి బ్రతుకులు ఏమంత బాగా లేవు. అధిక జీవన వ్యయం, పడిపోతున్న వేతనాలు, నిరుద్యోగం వారిని కూడా వెంటాడుతున్నాయి. ప్రభుత్వ సేవలలోని, ప్రైవేటు కార్యాలయాలలోని, బ్యాంకులలోని, భీమా కంపెనీలలోని, వాణిజ్య సంస్థలలోని, స్కూళ్ళు, కాలేజీల లోని మరి ఇతర సంస్థల లోని

మధ్య తరగతి వేతన జీవులు, కార్మికవర్గం, శ్రమ జీవులైన రైతులు ఎదుర్కొంటున్న సమస్యల్నే ఎదుర్కొంటున్నారు.

6. పారిశ్రామికవేత్తలూ, తయారీదార్లూ, వ్యాపారులూ కూడా గుత్తాధిపత్య ఆర్థిక సహాయకుల (ఫైనాన్షియర్ల), భూస్వాములు, సంస్థానాదీశులూ, తెర వెనుక నుండి పనిచేస్తున్న వారి బ్రిటిష్ సలహాదారుల పూర్తి పట్టులో ఉన్న ఈ ప్రభుత్వ విధానాల వలన నష్టపోతున్నారు. మూలధన విడుదల, ముడిసరకుల, రవాణా, ఎగుమతి దిగుమతి తదితర అనుమతులు తదితర కేటాయింపులన్నింటినీ చిన్న పారిశ్రామికవేత్తలనూ, వ్యాపారులనూ దెబ్బ తీసే విధంగా బడా గుత్తాధిపతులకు లాభం కలిగే విధంగా బ్యాంకర్లతోనూ, విదేశీ సంస్థల సిండికేట్లతో కుమ్మక్కై ప్రభుత్వ యంత్రాంగం లోని నిరంకుశాధికారులు నిర్వహిస్తున్నారు.

7. యుద్ధ ప్రయోజనాలను పోషించేవి తప్ప పునర్నిర్మాణం, నీటిపారుదల, జలవిద్యుత్ కేంద్రాల , ఫ్యాక్టరీల నిర్మాణం, తదితరాల పునర్నిర్మాణ పథకాలను ప్రత్యక్షంగా ప్రభుత్వం కానీ, లేదా ప్రైవేటు పెట్టుబడుల భాగస్వామ్యంలో కానీ వ్యవస్థాపన జరుగుతున్నది. నిపుణుల విదేశీ సంస్థలూ సరఫరాదారులూ, బాధ్యులుగా ఉన్న నిరంకుశాధిపత్య ఉన్నతాధికారులూ, స్టాక్ ఎక్స్చేంజిలలోని సట్టా వ్యాపారులూ రాజ్య బడ్జెట్‌ను దోచుకునే సాధనాలుగా అవి మారాయి. ప్రజలను దోచుకోవడం ద్వారా (బ్లాక్ మార్కెటీర్లచే)నల్ల బజారు వర్తకులచే నిర్మించబడిన పరిశ్రమల జాతీయీకరణ డిమాండును అది (ప్రభుత్వం)దివాళా తీసిన లేదా పరిశ్రమలను స్వాధీనం చేసుకోవడం లేదా నిరంతరం విఫలమయ్యే బోగస్ పథకాలలో పాల్గొని ఆ తర్వాత వాటిని ప్రభుత్వ తాబేదారులకు, బడా పెట్టుబడిదారులకు అమ్మడం ద్వారా రాజ్య బడ్జెట్ ను దోచుకోడానికి ఉపయోగించబడుచున్నది. దాని ఫలితంగా దేశ పారిశ్రామికీకరణ భారతదేశాన్ని పారిశ్రామిక దేశంగా మార్చడానికి ఖచ్చితంగా ఆసక్తి చూపని బ్రిటన్, అమెరికాల దయతో జరుగుతోంది, కావున బ్రిటిష్ రథ చక్రాలకు కట్టి వేయబడిన ఈ ప్రభుత్వం చేతుల్లో ముందుకు సాగడం లేదు.

8. ప్రజలలో ప్రత్యేకించి రైతులలో పెరుగుతున్న పేదరికం దేశంలోపల వాటికి తగిన మార్కెట్ ఇవ్వనందున, ఉనికిలో ఉన్న పరిశ్రమలు కూడా నిరంతరం సంక్షోభంలో ఉంటున్నాయి. విదేశీ సంస్థల, వలస ప్రపంచం యొక్క సామ్రాజ్యవాద యజమానుల పోటీకి వ్యతిరేకంగా దేశం లోపలా వెలుపలా వస్తారు, అందువలన ప్రతిష్టంభనలో ఉన్నట్లు తమకు తామే తెలుసుకుంటారు.

9. వీటన్నిటి కన్నా మిన్నగా, పెరుగుతున్న ప్రజల అసంతృప్తిని ఎదుర్కుంటున్నప్పుడు తడబడుతున్న ప్రభుత్వం ప్రజల పౌర హక్కులను అణచివేస్తున్న, రాజకీయ పార్టీలనూ గ్రూపులనూ అణచివేస్తున్న, కార్మిక సంఘాలనూ ఇతర ప్రజా సంఘాలనూ నిషేధిస్తున్న, వేలాది కార్మికులను, రైతులను, విద్యార్థులను, స్త్రీ పురుషులను జిల్లాలోనూ, నిర్బంధ శిబిరాలలోనూ బంధిస్తున్న వాస్తవం వెల్లడౌతున్నది. మొత్తం గ్రామీణ ప్రాంతంలో స్థానిక కాంగ్రెస్ నాయకుల, భూస్వాముల సహకారంతో పోలీసులు, నిరంకుశాధికారులు సర్వోన్నత పాలకులౌతున్నారు. అటువంటి పోలీసు రాజ్యాన్ని నిర్వహించడానికి పన్నుల భారం పెరుగుతుంది, రాజ్య బడ్జెట్‌లో 50 శాతం పైగా ప్రజల ఆహారానికి, బట్టలకు, గృహ వసతికి, విద్యకు, ఆరోగ్యానికి, పారిశుధ్యానికి కాక సైన్యం, పోలీసు, జైళ్ళు, నిరంకుశ పాలనా యంత్రాంగం పైన ఖర్చు పెట్టడంలో ఆశ్చర్య పడవలసింది ఏమీ లేదు.

10. ఈ పరిస్థితుల అర్ధం ఏమిటో భారత దేశ ప్రజలు క్రమంగా గ్రహించటం ప్రారంభించారు. భూస్వాముల, సంస్థానాధీశుల, ఆర్థిక దిగ్గజాల, సట్టా వ్యాపారుల ఈ ప్రభుత్వాన్ని, బ్రిటిష్ కామన్వెల్త్, బ్రిటిష్ సామ్రాజ్యవాదాల ఇష్టానుసారం నడుస్తున్న ఈ ప్రభుత్వాన్ని మార్చాల్సిన అవసరాన్ని అర్థం చేసుకోవటం ప్రారంభించారు. భ్రమలు తొలగిన ప్రజలు నెమ్మదిగా పోరాటాలలో పాల్గొంటున్నారు, ఈ దీర్ఘకాల ఆకలి, చావు పరిస్థితిని వారు ఇకపై తట్టుకోలేకపోతున్నారు. వారు నగరాల లోని కార్మికుల, గ్రామీణ ప్రాంతాలలోని రైతాంగ పోరాటాలలో వారు పాల్గొంటున్నారు.

11. పెరుగుతున్న ఈ ప్రజల ఐక్యతను, ప్రధానంగా కార్మికవర్గ ఐక్యతను, రైతాంగంతో దాని మైత్రిని, భూస్వాముల, సంస్థానాధీశుల, ప్రగతి నిరోధక బడా బూర్జువాల, బ్రిటిష్ సామ్రాజ్యవాదులతో కుమ్మక్కైన ఈ ప్రభుత్వాన్ని అంతం చేయాలనే ఆసక్తి కల అన్ని వర్గాల ఐక్యతను అడ్డుకోవటానికి ప్రస్తుత ప్రభుత్వం పోలీసూ అణచివేతతో పాటు ఇతర సాధనాలను కూడా ఉపయోగిస్తున్నది .

12.బ్రిటిష్ సామ్రాజ్యవాదం నుండి పూర్తిగా స్వాతంత్ర్య దేశంగా మన దేశాన్ని చేయాలనే ప్రజల కోర్కెను ఎరిగిన ప్రభుత్వం భారత దేశాన్ని గణతంత్ర రాజ్యంగా (రిపబ్లిక్ గా) ప్రకటించింది. సామ్రాజ్యవాదంతో దాని బంధాన్ని తెంచుకోడానికి ఇష్టపడక, గణతంత్ర రాజ్యాన్ని (రిపబ్లిక్ ను) సామ్రాజ్యంలో భాగంగా సిగ్గు లేకుండా అది (ప్రభుత్వం) ప్రకటించింది.

బ్రిటిష్ సామ్రాజ్యంలో సభ్యత్వం ప్రకటించినట్లుగా అధికారిక(సాదా సీదా) విషయం మాత్రమే కాదు. కొన్ని పరిస్థితులలో తన స్వంత ప్రయోజనం కోసం ఇంగ్లాండు, అమెరికాల మధ్య గల శత్రుత్వాలను వాడుకుంటూనే, బ్రిటిష్ సామ్రాజ్యవాదం యొక్క విదేశాంగ విధానాన్ని తప్పనిసరిగా భారత ప్రభుత్వం అమలు చేస్తుంది. యుద్ధాన్ని కోరుకొని, శాంతిని కోరుకుంటున్న ప్రజల నుండి వత్తిడి వలన శాంతికోసం, అణ్వాయుధాలకు వ్యతిరేకంగా అది మాట్లాడు తున్నప్పటికీ, కొరియా లోని అమెరికా సైనిక బలగాలకు నామమాత్రపు వైద్య సహాయమే అయినప్పటికీ సహాయం అందించటానికి అది వెనుకాడలేదు. స్వాతంత్ర్యం కోసం మలయా యొక్క పోరాటాన్ని అణచివేయటానికి గూర్ఖాలనూ , సిక్కులనూ సైన్యం లోకి రిక్రూట్ చేసుకోడానికి బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు అది అనుమతించింది. వియత్నాం ప్రజా రిపబ్లిక్‌కు వ్యతిరేకంగా జరుపుతున్న పోరాటంలో ఫ్రెంచ్ యుద్ధ విమానాలకు వాటి మార్గంలో భారత దేశంలో వాటికి ల్యాండింగ్ బేస్లను (వైమానిక స్థావరాలను) అనుమతించింది. భారత నౌకాదళం బ్రిటిష్ నౌకాదళంలో భాగంగా బ్రిటిష్ కమాండ్

కింద పనిచేస్తుంది. ప్రభుత్వ రక్షణ శాఖ యొక్క సైనిక సాంకేతికతకు కీ లు (నియంత్రణలు) బ్రిటిష్ సలహాదారుల చేతుల్లో ఉండి వారి ఆదేశాల మేరకు వాటి కదలికలు ఉన్నాయి. ఒక దేశం యొక్క సైనిక బలగాల స్వాతంత్ర్యం ఆ దేశ సార్వభౌమత్వానికి, స్వాతంత్ర్యానికీ సూచిక అయితే, మన స్వాతంత్ర్యంలో కీలక భాగం ఇంకా బ్రిటిష్ సామ్రాజ్యవాదుల చేతుల్లోనే ఉన్నాయి.

ఈ బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు విధేయతకు తోడుగా మన ఆర్థికవ్యవస్థలోకి, జీవితాలలోకి, రాజ్య వ్యవహారాలలోకి, అమెరికన్ సామ్రాజ్యవాదుల చొరబాటుకు మన ప్రభుత్వ విధానాలు త్రోవ చూపుతున్నాయి, అమెరికా పెట్టుబడులకు అదనపు బానిసత్వం లోకి నెట్టేసి భయపెడుతున్నాయి.

13. తమ పాలనకు కొత్త కాంగ్రెస్ ప్రభుత్వ తెర కప్పే ముందు బ్రిటిష్ సామ్రాజ్యవాదులు దేశాన్ని హిందూ-ముస్లిం మత కలహాలతో, ఊచకోతలతో ముంచెత్తి, దేశాన్ని రెండు రాజ్యాలుగా భారతదేశం, పాకిస్తాన్లుగా విభజించారు. తద్వారా భారత ఆర్థిక వ్యవస్థను వ్యవసాయ రంగం లోనూ, పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థను పారిశ్రామిక రంగం లోనూ బలహీన పరిచారు. ఆ విధంగా ఇరు రాజ్యాలనూ వైరం లోకి, అప్రకటిత యుద్ధంలోకి నెట్టి 'తటస్థ మూడవ పక్షం' అని పిలవబడే సామ్రాజ్యవాదులపై ఆధారపడేటట్లు చేశారు.

ప్రజల న్యాయమైన డిమాండ్లను హిందూ-ముస్లిం యుద్ధోన్మాదంలో ముంచెత్తేందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి దేశ విభజన అనుమతించింది. ప్రజల జీవన పరిస్థితులను మెరుగుపరచడానికి ఉపయోగించవలసిన ధనాన్ని ఆయుధాల కోసం ఖర్చు చేయడానికి ఇది ప్రభుత్వానికి అనుమతించింది. భారత, పాకిస్తాన్‌లకు వారు బకాయా పడిన స్టెర్లింగ్ నిల్వలకు బదులు పాతబడిన (సెకండ్ హేండ్) సరకులు సేవలు తప్ప మరేమీ అమ్మటాన్ని, ప్రజలకు అవసరమైన యంత్రాల, సరకుల

సరఫరా అందకుండా చేయడాన్ని కోరుకోని బ్రిటిష్ సామ్రాజ్యవాదుల నుండి ఆయుధాలు బ్రిటిష్ సామ్రాజ్యవాదుల నుండి కొనడానికి వారిని (కాంగ్రెస్ ప్రభుత్వాన్ని) అనుమతించింది.

14. వారి స్వేచ్ఛాయుత అభివృద్ధి కొరకు, పూర్వపు మిశ్రమ బ్రిటిష్ ప్రావిన్సులనూ, సంస్థానాలనూ ఐక్య భారత దేశంలో భాగంగా, స్వయం ప్రతిపత్తి గల భాష ప్రయుక్త రాష్ట్రాలుగా పునర్నిర్మాణం చేయాలనే భారత దేశం లోని వివిధ జాతుల డిమాండ్లను ముంచి వేయడానికి దేశ విభజనను , మత కలహాలనూ వాడారు. ఒకే ఐక్య దేశం పేరున అన్ని జాతులకూ రాష్ట్రాలకూ వారి స్వంత జాతీయ భాషకు నష్టం కలిగించే లాగా ఒక ప్రాంతం వారి భాషను హిందీని, విధిగా రాష్ట్ర భాషగా ప్రకటించడం జరిగింది. ఒకే జాతికి చెందిన విస్తారమైన ప్రాంతాలు, లక్షలాది ప్రజలు నిరంకుశాధికార్ల, అన్య జాతి ఆధిపత్యం లోని ప్రభుత్వాల పాలనలో జీవించేటట్లు బలవంత పెట్టబడ్డారు. తమ స్వంత ఆర్థిక వ్యవస్థా, సంస్కృతీ గల పెద్ద గిరిజన ప్రాంతాలు, ఏదో ఒక పరాయి గ్రూపుకు (సమూహానికి) చెందిన భూస్వాముల, ఆర్థిక తిమింగలాల దయా దాక్షిణ్యాలకు వదిలివేశారు. ఐక్య భారత దేశం కోసం ప్రజల కోర్కెను ఆ విధంగా ఉపయోగించుకొని నిజానికి ప్రజల మధ్య అసమ్మతిని, విభజనకు బీజాలు వేశారు.

15. ఆ క్రమంలో, అంతిమంగా, ప్రజా ప్రభుత్వంగా ముందుకు రావడానికి, శాసన సభలలో వాగ్వాదాలపై లక్షలాది రూపాయల ప్రజల సొమ్మును వెచ్చించిన తర్వాత ప్రభుత్వం ప్రజాస్వామిక రాజ్యాంగం అని అది పిలిచే రాజ్యాంగాన్ని ప్రభుత్వం తయారు చేసింది, ఆ రాజ్యాంగం ప్రకారం తమ స్వంత ఇచ్చాను సారం ప్రభుత్వాన్ని ఎన్నుకొని రాజ్యాంగం క్రింద ఇవ్వబడిన ప్రాథమిక హక్కులను సాధించుకోమని ప్రజలకు పిలుపునిచ్చింది. వారు కోరుకంటే, స్వేచ్ఛాయుత గణతంత్ర భారత రాజ్యాంగం ద్వారా

తమ స్వాతంత్ర్యాన్ని ఉపయోగించుకుంటే, ప్రస్తుత నిరంకుశ పాలనను వారు ముగించగలరని ప్రజలకు చెప్పారు.

16. భారత రాజ్యాంగంలో సార్వత్రిక వయోజన ఓటు హక్కు ఉంది, దానిని ప్రజలు ఉపయోగించుకోగలరు, ఉపయోగించుకుంటున్నారు అన్నది వాస్తవం కాగా, దేశంలో భూస్వామ్య-పెట్టుబడిదారీ పాలనను, రాజ్య జీవనంలో పెట్టుబడిదారీ పట్టును, అంతమొందించడానికి రాజ్యాంగానికి లోబడి జరిగే ఎన్నికలు ఒక్కటే సరిపోతాయని చెప్పడం ప్రజలను మోసం చేయడమే. భూమి రైతాంగం చేతుల్లో కాక భూస్వాముల చేతుల్లో ఉన్నంత వరకూ, భూస్వాములు, పెట్టుబడిదారులు ప్రజలను పొలాలకు, (ఫ్యాక్టరీలకు) కర్మాగారాలకు కట్టి పడేసి ఉంచినంతవరకూ, పత్రికల పైనా, ప్రచారసాధనాల పైనా పెట్టుబడి ఆధిపత్యం అబద్ధాల మత్తులో ప్రజలను ఉంచుతున్నంత వరకూ, ధన బలం కుల, మత వైరాన్ని, ఘర్షణను, ఉపయోగించుకుని ప్రజలను విడదీసి, బలహీన పరుస్తున్నంతకాలం, నిరంకుశాధికారులూ, పోలీసులూ రాజకీయ పార్టీలను నిషేదిస్తున్నంత కాలం, పౌర హక్కులను అణచివేస్తున్నంత కాలం, వారి రాజకీయ అభిప్రాయాల, వారి నిజాయితీ కారణంగా చట్ట సభలకు ఎన్నికైన ప్రజా ప్రతినిధులను కూడా విచారణ లేకుండా జైళ్ళలో నిర్బంధిస్తున్నంత కాలం, సార్వత్రిక వయోజన ఓటు కార్మికవర్గ , ప్రజల పరిపక్వతను కొలవడానికి కొలబద్ధ మాత్రమే ఉపయోగ పడుతుంది తప్ప అది దోపిడీకి గురవుతున్న ప్రజల నిజమైన అభిప్రాయాన్ని, ప్రజల ప్రయోజనాలను వ్యక్తం చేయదు.

17. నూతన రాజ్యాంగం క్రింద ప్రజలు లేదా వారిచే ఎన్నుకోబడిన ప్రభుత్వం వారికి స్వేచ్ఛా, సంతోషం కలిగించే విధంగా పని చేయవచ్చునని చెప్పటం కూడా మోసగించడమే. ఏ విధంగానైనా అమలు చేయబడే, అత్యవసర పరిస్థితి పేరున నిరంకుశాధికార

వర్గం విడుదల చేసే తొలగించటానికి వీలులేని, ఉల్లంఘించ టానికి వీలులేని నిరంకుశ శాసనాల ద్వారా ఉల్లంఘనకు గురికాని హక్కులను వేటినీ రాజ్యాంగం హామీ ఇవ్వదు. సమ్మె హక్కు, జీవన భ్రుతి, కార్మిక, ఉద్యోగ వర్గాలకు పనికి మరియు విశ్రాంతికి హామీ ఇవ్వబడలేదు, అమలుచేయ గలిగినదిగా చేయబడలేదు. భూస్వాముల భూములు, సింహాసనం నుండి తొలగించబడిన, సింహాసనంను అధిష్టించిన సంస్థానాధీశుల ఆస్తులు, ఆదాయాలు అనుల్లంఘనీయం చేయబడ్డాయి. భూమి లేని రైతులు భూమి పొందవచ్చు అన్నట్లుగా కనపడుతుంది కానీ అది అతను కొనగలిగితేనే, లేదా భూస్వామికి దానికి పరిహారం చెల్లిస్తే నే అతను (భూమి లేని రైతు) భూమిని పొందగలడు. కానీ భూమిని కొనటానికి, పరిహారం చెల్లించటానికి పెట్టుబడి అవసరం. కానీ లక్షలాది మంది నిరుపేద రైతులు రెక్కాడితే కానీ డొక్కాడని స్థితిలో ఉన్నారు, వారి వద్ద పెట్టుబడి లేదు. అందుచేత, పెద రైతులు భూమి లేకుండానే ఉండాలి, పేదరికం లోనే మగ్గాలి మన దేశంలో విదేశీ మదుపరుల ఆస్తులను పవిత్రమైనవిగా, అనుల్లంఘనీయమైనవిగా చేస్తూ మన ప్రభుత్వం, బ్రిటన్, అమెరికాలతో చేసుకున్న అనేక ఒప్పందాల లక్షణం ఇది. వారికి అటువంటి హామీలు ఇచ్చినందున వారి లాభాలను కూడా అంటుకోలేని పరిస్థితి, వారి ఇచ్చాను సారం వాటిని దేశం వెలుపలకు తీసుకొని వెళ్లనివ్వాలి. అదే సమయంలో పోలీసు ఆఫీసర్ల క్లబ్-లా నుండి, వడ్డీ వ్యాపారుల, లాభార్జనా పరుల దోపిడీ నుండి ప్రజల రక్షణకు హామీ ఇవ్వటానికి ప్రభుత్వం నిరాకరిస్తున్నది.

మన ఆర్థిక వ్యవస్థపై, భూమిపై, పెట్టుబడులపై భూస్వాముల, సంస్థానాధీశుల, సామ్రాజ్యవాదుల కబంధహస్తానికి హామీ ఈ రాజ్యాంగం కల్పిస్తుండగా, వాటిని భ్రమాత్మక కోర్కెలని ప్రకటించటానికి మించి, మన ప్రజల జీవితాలకు, స్వేచ్ఛకు సంబంధించిన ఒక్క విషయంలో కూడా హామీ ఇవ్వలేదు ఈ రాజ్యాంగం. ఈ రాజ్యాంగాన్ని నిజమైన ప్రజాస్వామిక రాజ్యాంగం

అని పిలవలేము. కానీ ఇది విదేశీ సామ్రాజ్యవాదుల ముఖ్యంగా బ్రిటిష్ సామ్రాజ్యవాదుల ప్రయోజనాలతో ముడి వేసుకుని ఉన్న భూస్వామ్య-పెట్టుబడిదారీ రాజ్య రాజ్యాంగం మాత్రమే.

18. ప్రజలను పేదరికం లోకి నెట్టిన, వారిని చట్టవిరుద్ధమైన పాలనకు గురిచేసిన, పైన వివరించిన భయంకరమైన పరిస్థితుల దృష్ట్యా, ప్రస్తుత ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం పోయింది, ఇది చాలా సహజం, వారు దీనిపట్ల తీవ్రమైన అపనమ్మకానికి లోనౌతున్నారు. భూస్వాములను, వడ్డే వ్యాపారులను, దోపిడీ దారులను ప్రజలకు వ్యతిరేకంగా బలపరుస్తున్న ప్రభుత్వంగా పరిగణించడం ప్రారంభించారు. అంతేకాక అనేక ప్రావిన్సులలో ప్రస్తుత ప్రభుత్వ అమానుష పాలనకు వ్యతిరేకంగా విస్తృత ప్రజానీకం తమ అసంతృప్తిని, తిరుగుబాటును బహిరంగంగా వెల్లడిస్తున్నది. ఈ ప్రభుత్వానికి ప్రత్యామ్నాయంగా ప్రజల ఇష్టాన్ని, ప్రయోజనాలను వ్యక్తం చేయగల, ఇంకా భూస్వాముల, పెట్టుబడిదారుల, లాభార్జనాపరుల, వడ్డీవ్యాపారుల, విదేశీ సామ్రాజ్యవాదుల దోపిడీ నుండి రక్షించగలిగిన కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు మార్గాలు అన్వేషిస్తున్నారు.

19. ఈ వాస్తవాలను ఎరిగిన భారత కమ్యూనిస్టు పార్టీ, ఆచరణాత్మకమైన కర్తవ్యాలను, భారత కమ్యూనిస్టు పార్టీ సమర్థిస్తున్న, వారిని ప్రస్తుత ప్రభుత్వం నెట్టిన ప్రతిష్టంభన నుండి బయట పడాలని వారు కోరుకుంటే, వారి స్వేచ్ఛను, ఆనందాన్ని పొందాలని వారు కోరుకుంటే, భారత ప్రజలు అమలు చేయవలసిన కార్యక్రమాన్ని ప్రజల ముందుంచి వారికి వివరించడం తన కర్తవ్యంగా భావిస్తున్నది.

సోషలిస్టు సమాజ నిర్మాణానికి కట్టుబడి ఉన్నా, మన అభివృద్ధి యొక్క ప్రస్తుత దశలో మన దేశంలో సోషలిజాన్ని కమ్యూనిస్టు పార్టీ డిమాండు చేయటం లేదు. భారత దేశ ఆర్థికాభివృద్ధి వెనుకబాటుతనం దృష్ట్యా, కార్మికుల, కర్షకుల (రైతుల), శ్రమజీవులైన మేధావుల ప్రజాసంఘాల బలహీనతల కారణంగా

మన దేశంలో సోషలిస్టు పరివర్తనను తక్షణమే చేపట్టడం సాధ్యం కాదని మన పార్టీ అనుకుంటున్నది. ప్రస్తుతం ఉన్న అప్రజాస్వామిక, ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని, మన దేశం లోని అన్ని ప్రజాస్వామిక, భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తుల సంకీర్ణం ద్వారా స్థాపించబడిన, రైతులకు ఉచితంగా భూమి ఇవ్వటం, విదేశీ సరకుల పోటీ నుండి మన జాతీయ పరిశ్రమల రక్షణకు, దేశ పారిశ్రామికీకరణకు హామీ ఇవ్వగలిగిన, ప్రజల హక్కులకు సమర్థవంతంగా హామీ ఇవ్వగల, కార్మికులకు ఉన్నత జీవనప్రమాణాలను ఇవ్వగలిగిన, ప్రజలని నిరుద్యోగ సమస్యనుండి విముక్తి చేయగలిగిన, ఆ విధంగా దేశాన్ని విశాలమైన ప్రగతి పథంలో, సాంస్కృతిక పురోగమనంలో నిలుపగలిగిన స్వాతంత్ర్యాన్ని పరిరక్షించగలిగిన, జనతా ప్రజాస్వామిక కొత్త ప్రభుత్వం ద్వారా భర్తీ చేయటం చాలా పరిణతి చెందిన కర్తవ్యంగా మన పార్టీ భావిస్తున్నది.

భారత కమ్యూనిస్టు పార్టీ అభిప్రాయంలో నూతన జనతా ప్రజాస్వామిక ప్రభుత్వం నిర్వర్తించవలసిన ఆచరణీయ కర్తవ్యాలు ఏవి?

## ఈ కర్తవ్యాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి:

## రాజ్య స్వరూపం విషయంలో
## (రాజ్య నిర్మాణ రంగంలో)

20. ప్రజల సార్వభౌమాధికారం అంటే దేశంలోని సర్వాధికారమూ ప్రజల చేతుల్లో ఉండటం. రాజ్యం లోని సర్వోన్నత అధికారం ప్రజల చే ఎన్నుకోబడిన, మెజారిటీ ప్రజల డిమాండుపై ఎప్పుడైనా పదవిని వదులుకోవడానికి సిద్ధంగా ఉండే, ప్రజానురంజక చట్టసభను, ఒకే శాసన సభను ఏర్పాటు చేసే ప్రజా ప్రతినిధుల చేతుల్లో ఉంచాలి,

21. గణతంత్ర రాజ్యం (రిపబ్లిక్) యొక్క అధ్యక్షుని హక్కులకు పరిమితి, దాని ద్వారా అధ్యక్షుడు లేదా అతని ద్వారా అధికారం పొందిన వ్యక్తులు చట్ట సభల చే అనుమతించబడని చట్టాలను

ప్రకటించే హక్కును కోల్పోతారు. అధ్యక్షుడు శాసన సభ ఎన్నుకుంటుంది.

22. శాసనసభలకూ, వివిధ స్థానిక ప్రభుత్వ సంస్థలకూ జరిగే అన్ని ఎన్నికలలోనూ 18 సంవత్సరాలు వయస్సు వచ్చిన భారత పౌరులైన స్త్రీ, పురుషులందరికీ సార్వత్రిక, సమాన, ప్రత్యక్ష ఓటు హక్కు , రహస్య ఓటు పద్ధతి ఉంటుంది, ఏదైనా ప్రాతినిధ్య సంస్థకు ఎన్నికయ్యే హక్కు ప్రతి ఓటరుకూ ఉంటుంది, అన్ని ఎన్నికలలోనూ రాజకీయ పార్టీలకు దామాషా ప్రాతిపదికన ప్రాతినిధ్యం ఉంటుంది.

23. ప్రజలెన్నుకున్న కమిటీల ద్వారా విస్తృతాధికారాలతో విస్తృత స్థాయిలో స్థానిక ప్రభుత్వం. పైనుండి నియమించబడిన అన్ని స్థానిక, ప్రాంతీయ అధికారుల పదవుల రద్దు. (ఉదాహరణకు, గవర్నర్లు, మేజిస్ట్రేట్లు, కమిషనర్లు తదితరులు)

24. వ్యక్తి మరియు నివాసాల అనుల్లంఘనీయత, మనస్సాక్షికి, మతపరమైన నమ్మకం మరియు ఆరాధన, వాక్స్వాతంత్రం, పత్రికా స్వేచ్ఛ, సమావేశాలకు, సమ్మెలకు మరియు సభలకు అడ్డంకులు లేని స్వేచ్ఛ, సంచారానికీ, వృత్తి ఎంపికకు స్వేచ్ఛ ఉంటాయి.

25. కులం, మతం, లింగం, జాతి లేదా జాతీయతల భేద భావం లేకుండా పౌరులందరికీ సమాన హక్కులు, సమాన పనికి సమాన వేతనం,మహిళలను బాధించే సామాజిక అశక్తతలు (వైకల్యాలు) నిషేధించబడతాయి. ఆస్తి వారసత్వం, వివాహం, విడాకుల చట్టాలు, వృత్తులు, ఉద్యోగాలలో ప్రవేశం వంటి తదితర విషయాలలో పురుషులతో సమాన హక్కులను పొందడం, అమలు చేయడం వంటి విషయాలలో మహిళలకు రక్షణ ఇవ్వబడుతుంది. ఒక కులాన్ని మరొక కులం సామాజిక, ఆర్థిక అణచివేయడం లేదా అగ్రవర్ణాలు అని పిలువబడే కులాల వారు దిగువ కులాల వారిపైన ప్రత్యేకించి షెడ్యూల్డ్ కులాల వారిపైన ఆచారం, సాంప్రదాయం లేదా మతం పేరున విధించే సామాజిక,

వ్యక్తిగత నిషేధాలు, ఆంక్షలు నిషేధించబడతాయి, చట్ట ప్రకారం శిక్షార్హం చేయబడతాయి.

## మతపరమైన (మైనారిటీలకు) అల్పసంఖ్యాకులలకు వివక్షకు వ్యతిరేకంగా రక్షణ కల్పించాలి.

26. అన్ని జాతులకూ స్వయం నిర్ణయాధికార హక్కు. గణతంత్ర (రిపబ్లిక్) భారత దేశం బలవంతంగా కాకుండా ఉమ్మడి రాజ్యం ఏర్పాటుకు వారి స్వచ్ఛంద సమ్మతి ద్వారా భారత దేశం యొక్క వివిధ జాతులను ఐక్యం చేస్తుంది.

27. భారత దేశం లోని రాష్ట్రాల ప్రస్తుత సరిహద్దులను ఉమ్మడి భాష సూత్రం ప్రాతిపదికన పునర్వ్యవస్థీకరించబడతాయి, రాష్ట్రాలు పునర్నిర్మించబడతాయి. సంస్థానాలు ఉన్నచోట వాటిని రద్దు చేసి ప్రక్కనే ఉన్న భాష ప్రయుక్త రాష్ట్రాలలో కలిపి వేయబడతాయి, విదేశాల ఆధీనంలో ఉన్నవాటిని దేశంలో కలిపివేసి, అవే సూత్రాల ఆధారంగా పునర్వ్యవస్తీకరించబడతాయి. గిరిజన ప్రాంతాలకు , లేదా జనాభా కూర్పులో నిర్థిష్టంగా ఉన్న, నిర్దిష్ట సామాజిక పరిస్థితులద్వారా విభిన్నంగా ఉన్న ప్రాంతాలకు , లేదా మైనారిటీ జాతుల ప్రాంతాలకు పూర్తి ప్రాంతీయ స్వయంప్రతిపత్తి మరియు ప్రాంతీయ ప్రభుత్వం ఉంటుంది, వాటి అభివృద్ధికి పూర్తి సహకారం ఉంటుంది.

28. కార్మికులకు, రైతులకు, చేతివృత్తుల వారికి పన్నులో గరిష్ట ఉపశమనం కల్పించే విధంగా పరిశ్రమలలో, వ్యవసాయంలో, వాణిజ్యంలో ప్రగతిశీల ఆదాయ పన్ను విధానం, ప్రవేశ పెట్టబడుతుంది.

29. విద్య సంస్థలలో వారి మాతృభాషలో విద్యాబోధన పొందేందుకు ప్రజలకు హక్కు కలిగించబడుతుంది. అవసరమైన చోట

మైనారిటీ లేదా ప్రాంతం యొక్క భాషను ఉపయోగించే ఏర్పాటుతో ఒక నిర్దిష్ట రాష్ట్రం యొక్క ప్రైవేటు, ప్రభుత్వ సంస్థలన్నిటిలోనూ జాతీయ భాష ఉపయోగించబడుతుంది. హిందీని అఖిలభారత రాష్ట్ర భాషగా ఉపయోగించడం అనివార్యం కాదు.* హిందుస్తానీ మాట్లాడే ప్రాంతాలలో అరుదు, దేవ నాగరి లిపులకు, ఈ రెండు లిపులలో ఏ లిపిపైనా ఉపయోగించేందుకు ప్రజల హక్కుకు పరిరక్షణ, రక్షణ కల్పించబడుతుంది.

* పార్టీ మూడవ మహాసభ ఈ దిగువ పదాలను ఇక్కడ చేర్చింది: కానీ సమాచార బట్వాడా కొరకు, వివిధ రాష్ట్ర ప్రభుత్వాల మధ్య, ప్రజల మధ్య సాధనంగా (అనుసంధాన భాషగా) ప్రోత్సహించబడుతుంది.

30. అటువంటి కళలు, సాహిత్యం, సంస్కృతిని ప్రోత్సహించడానికి తీసుకునే చర్యలు:

వారి భాష, సంస్కృతిని వారి స్వంత మార్గంలో, మొత్తం దేశం యొక్క ప్రజాస్వామిక ప్రజానీకం యొక్క ఉమ్మడి ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధిచేయడానికి గిరిజనులతో సహాయ ప్రతి జాతినీ ప్రోత్సహించాలి;

వారి జీవన పరిస్థితులను మెరుగుపరచుకోవడానికి, వారి జీవితాన్ని సుసంపన్నం చేసుకోవడానికి వారు చేస్తున్న పోరాటంలో ప్రజాస్వామ్య ప్రజానీకానికి సహాయం చేయాలి;

కుల, మత విద్వేషాలను, భయం మరియు పక్షపాత ఆలోచనలను, భూస్వామ్య వర్గాలు వారిలో సంప్రదాయబద్ధంగా వారి మనస్సులోకి చొప్పించిన విధేయత, మూఢనమ్మకాలను , వదిలించుకోవడానికి శ్రమజీవులకు సహాయం చేయాలి;

అన్ని దేశాల శాంతిని ప్రేమించే అన్ని దేశాల ప్రజలతో సోదర భావాన్ని పెంచే, జాతి మరియు జాతీయ ద్వేషాల ఆలోచనలను నిరుత్సాహ పరిచే అందరికీ సహాయం చెయ్యాలి;

సామ్రాజ్యవాద యుద్ధ ప్రచారాన్ని నిరుత్సాహపరచాలి, అందరికీ శాంతిని, స్వేచ్ఛను సాకారం చేయడానికి ప్రజలకు సహాయపడాలి.

31. ప్రజా కోర్టులో ఏ అధికారినైనా నిలబెట్టడానికి అందరికీ హక్కు

32. అన్ని మత సంస్థల నుండి రాజ్యాన్ని వేరుగా ఉంచాలి. రాజ్యం మతాతీత రాజ్యంగా ఉండాలి.

33. పద్నాలుగు సంవత్సరాల వయస్సు లోపల ఉన్న పిల్లలందరికీ ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్య.

34. ప్రజా సిబ్బందిని పోలీసు స్థానంలో భర్తీ చెయ్యాలి. కిరాయి సైన్యాన్ని మరియు ఇతర దండించే బలగాల నిర్మూలన చేయాలి. ప్రజలతో సన్నిహిత సంబంధం గల జాతీయ సైన్యం, నౌకా దళం, వాయు సేనలను భారత దేశ రక్షణ కోసం స్థాపించాలి.

35. దేశంలో మలేరియా, కలరా, మరి ఇతర అంటువ్యాధుల నిర్మూలన లక్ష్యంగా రూపొందించిన దేశ-వ్యాపిత వైద్య కేంద్రాల, ఆసుపత్రుల నెట్ వర్క్ తో ప్రజారోగ్య సేవా సంస్థను స్థాపించాలి.

## వ్యవసాయ రంగంలో రైతాంగ సమస్య

వ్యవసాయ, రైతాంగ సమస్య మన దేశ జీవితంతో అత్యంత ప్రాముఖ్యత గల అంశం.

భూమి లేని పేద రైతాంగం వ్యవసాయాన్ని మెరుగుపరచడానికి అవసరమైన అత్యంత ప్రాథమిక వ్యవసాయ పనిముట్లను కొనుగోలు చేయలేక పోతున్నందున మనం వ్యవసాయాన్ని చెప్పుకోదగ్గ స్థాయిలో అభివృద్ధి చేయలేము, దేశానికి అవసరమైన ఆహారాన్ని, మోడి సరకులను అందించలేము.

జనాభాలో 80 శాతం ఉన్న నిరుపేదలైన రైతులు ఉత్పత్తి చేసిన సరకులను కనీస పరిమాణంలో కూడా కొనలేక పోతున్నందున మనం జాతీయ పరిశ్రమలను చెప్పుకోదగ్గ స్థాయిలో అభివృద్ధి చేసి దేశాన్ని పారిశ్రామికీకరించలేము.

అర్థాకలితో జీవిస్తున్న రైతాంగానికి ప్రభుత్వాన్నుండి ఏ సహాయమూ అందడం లేదు, వారు ప్రభుత్వాన్ని ద్వేషిస్తున్నారు, మద్దతివ్వటానికి నిరాకరిస్తున్నారు, కావున మనం మన దేశాన్ని ఏ స్థాయిలోనూ సుస్థిరం చేయలేము.

పేదరికం వలన ఆకలితో అలమటిస్తున్న లక్షలాదిమంది ప్రజలు గ్రామీణ ప్రాంతాల నుండి తరలి వచ్చి పట్టణాలలో లేబర్ మార్కెట్ ను ముంచెత్తి తక్కువ కూలి కి శ్రమ అందుబాటుకు, పెరుగుతున్న నిరుద్యోగ సైన్యానికి కారణమౌతున్నందున శ్రమజీవుల జీవన ప్రమాణాలను మెరుగు పరచడం అసాధ్యం చేస్తున్నారు. కావున మనం శ్రమ జీవుల జీవన ప్రమాణాలను ఏ స్థాయిలోనూ మెరుగుపరుచలేము.

అర్ధాకలితో మగ్గుతున్న జనాభాలో అత్యధిక భాగంగా ఉన్న రైతాంగం తమ పిల్లలను చదివించుకోటానికి తగిన సాధన సంపత్తి లేకుండా ఉన్నారు, ఆ కారణంగా మనం వారిని సాంస్కృతిక వెనుకబాటుతనం నుండి బయట పడవేయలేము.

ఈ దురాచారాలన్నింటినీ వదిలించుకుని, దేశాన్ని సాంస్కృతిక వెనుకబాటుతనం నుండి బయట పడ వేయాలంటే మానవ మనుగడకు అవసరమైన జీవన పరిస్థితులను రైతాంగానికి కల్పించాలి, అందుకు భూస్వాముల భూమిని స్వాధీనం చేసుకుని రైతాంగానికి భూమిని పంచవలసి ఉంది. దున్నే వానికి భూమి నినాదాన్ని సాకారం చేయవలసి ఉంది.

## దీనిని సాధించడానికి ఇవి అవసరం:

36. చెల్లింపులు ఏమీ లేకుండా భూస్వాముల భూములను వ్యవసాయ కార్మికులతో సహాయ పేద రైతాంగానికి అప్పగించాలి. ఈ సంస్కరణను చట్టబద్ధం చేయడానికి ప్రత్యేక భూ యాజమాన్య చట్టాన్ని తీసుకువచ్చి తద్వారా నష్ట పరిహారం లేకుండా, భూస్వామ్య విధానం రద్దును సాకారం చేయాలి.

37. వ్యవసాయ పనిముట్లను, విత్తనాలను రైతులు కొనుక్కోవటానికి అనువుగా దీర్ఘకాలిక చౌక ఋణాలను కల్పించాలి. ముడి సరకులు తదితర సామాగ్రిని కొనుగోలు చేసుకోటానికి, తమ ఉత్పత్తిని, వ్యాపారాన్ని కొనసాగించటానికి అనువుగా చేతివృత్తుల వారికి (హస్త కళల నిపుణులకు) దీర్ఘకాలిక చౌక ఋణాలను కల్పించాలి.

38. పాత నీటి పారుదల వ్యవస్థలను మెరుగు పరచుకోటానికి, కొత్త నీటి పారుదల వ్యవస్థలను నిర్మించుకోటానికి రైతాంగాన్ని ప్రభుత్వ సహకారం అందించాలి.

39. వడ్డీవ్యాపారులకు రైతులు, చేతివృత్తుల వారు (హస్త కళా నిపుణులు) బకాయి పడిన అప్పులను రద్దు చేయాలి.

40. వ్యవసాయ కార్మికులకు తగిన జీవన ప్రమాణాలకు సరిపడా వేతనాలను కల్పించాలి.

## పారిశ్రామిక రంగంలో కార్మిక సమస్య

రైతాంగం యొక్క చాలా తక్కువ కొనుగోలు శక్తివలన నే కాక దేశం లోనికి దిగుమతి అవుతున్న విదేశీ వస్తువుల పోటీని ఎదుర్కొనవలసి రావటం నుండి కూడా మన దేశీయ (జాతీయ) పరిశ్రమలు దెబ్బతింటున్నాయి. విదేశీ సరకుల వినాశకరమైన పోటీ నుండి ఉత్పత్తిదారులకు ప్రభుత్వ రక్షణ కొరవడినందున పోతే వలన తమకు వస్తున్న నష్టాలను భర్తీ చేసుకోటానికి పని పరిస్థితులను మరింత దిగజార్చడం ద్వారా వారు ఆ భారాన్ని కార్మికవర్గం పైన మోపుతున్నారు. పని పరిస్థితులు అధ్వాన్నమైతే ఆకలితో అలమటించే, చేతిలో డబ్బులు లేని కార్మికులు ఆధునిక పరిశ్రమ అభివృద్ధికి తగరు కావున పరిశ్రమలు అభివృద్ధి చెందలేవు. మన దేశీయ పరిశ్రమలు అభివృద్ధి చెందక పోవటానికి ఈ పరిస్థితి మరొక కారణం. ఈ విషవలయాన్ని ఛేదించాలంటే మన దేశీయ పరిశ్రమలకు దిగుమతి అవుతున్న విదేశీ సరకుల పోటీ నుండి రక్షణ కల్పించాలి, దేశం అంతటా పారిశ్రామికీకరణ చేయాలి, కార్మికవర్గ స్థితిగతులను (జీవన ప్రమాణాలు, పని పరిస్థితులు) మెరుగుపర్చాలి. దీని సాధనకు ఇవి అవసరమని భారత కమ్యూనిస్టు పార్టీ భావిస్తున్నది:

**41.** మన దేశంలో విదేశీ సరకుల పోటీ నుండి మన దేశీయ పరిశ్రమలను రక్షించడానికి తగిన చట్టాలను చేయాలి.

**42.** దేశీయ పరిశ్రమలను అభివృద్ధి చేయడానికి, అందుకు అనువైన పరిస్థితుల కల్పనకు ఏ ప్రయత్నాన్ని, వనరులను, మన దేశం విడిచిపెట్టకూడదు.

**43.** ప్రజల ప్రయోజనార్థం ప్రణాళికా బద్ధ దేశ ఆర్థికాభివృద్ధి కొరకు ఆర్థిక వ్యవస్థ లోని వివిధ రంగాలను క్రమబద్ధీకరించాలి, సమన్వయం చేయాలి.

**44.** అన్నీ పరిశ్రమలలోనూ, వాణిజ్య సంస్థల లోనూ జీవన భృతిని, ఎనిమిది గంటల పని దినాన్ని నిర్ణయించడం ద్వారా, భూగర్భ గనులలోనూ. ఆరోగ్యానికి హానికరమైన ఇతర వాణిజ్య సంస్థల లోనూ (వృత్తుల లోనూ) ఆరు గంటల పని దినాన్ని నిర్ణయించడం ద్వారానూ, ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడిదారుల ఖర్చుతో ప్రతి రకమైన అంగవైకల్యం, నిరుద్యోగం నుండి రక్షణకు సామాజిక భీమా కల్పన, కార్మిక సంఘాలతో కలిసి పనిచేసే లేబర్ ఎక్స్చేంజీల ఏర్పాటు, పారిశ్రామిక కోర్టుల ఏర్పాటు, కార్మిక సంఘాల గుర్తింపు, సామూహిక బేర సారాల హక్కు, సమ్మె హక్కు కల్పనల ద్వారా కార్మికుల జీవన ప్రమాణాలను, పని పరిస్థితులను (విప్లవాత్మకంగా) సమూలంగా మార్చాలి.

**45.** సామూహిక వినియోగ వస్తువుల ధరలపై సమర్థవంతమైన నియంత్రణను అమలు చేయాలి.

**46.** శరణార్థుల జనాభా సమస్య ప్రదానంగా లక్షలాది కార్మికుల, రైతుల, (హస్తకళా నిపుణుల) చేతివృత్తుల వారి, మధ్యతరగతి ఉద్యోగుల తదితరుల సమస్యను వారికి వేగవంతంగా పునరావాసం కల్పించి, ప్రత్యేకించి వారికి భూమిని, పరికరాలను ఇచ్చి ఉద్యోగ కల్పన చేసి, వారి స్వజాతి సంస్కృతికి తగిన విధంగా అభివృద్ధి కావడానికి అవసరమైన సౌకర్యాలు కల్పించి, ప్రభుత్వం (రాజ్యం) సత్వరమే వారి సమస్యను పరిష్కరించాలి,

# భారత దేశానికి జాతీయ స్వాతంత్ర్యం

భారత దేశాన్ని బ్రిటిష్ వారు వదిలి వెళ్లిపోయారని చాలా ప్రచారం జరిగిన ప్రకటన ఉన్నప్పటికీ పెద్ద సంఖ్యలో భారత కర్మాగారాలు, వర్క్ షాపులు, గనులు, తోటలు (ప్లాంటేషన్లు), షిప్పింగు మరియు బ్యాంకింగు వ్యవస్థలు ప్రతి ఏటా వాటి నుండి వందల మిలియన్ల లాభాలు ఆర్జిస్తున్న బ్రిటిష్ పెట్టుబడిదారుల స్వంతం అన్నది వాస్తవం. మన ఆర్థిక వ్యవస్థపై వారికున్న ఈ అధికారంతో, వారికి సహకరిస్తున్న మన దేశపు బడా పెట్టుబడిదారులతో వారికి గల సంబంధాలు, భాగస్వామ్యంతో బ్రిటిష్ సామ్రాజ్యవాదులు తెరవెనుకనుండి మరియు వారికి సహకారం అందిస్తున్నవారితో కలిసి మన పరిశ్రమల అభివృద్ధిని అడ్డుకుంటున్నారు. తద్వారా మన పేదరికాన్ని శాశ్వతం చేస్తున్నారు.

విస్తృత స్థాయిలో పారిశ్రామికీకరణ జరిగే వరకూ మన దేశం బలమైన, సుసంపన్న దేశం కాలేదు; కానీ బ్రిటిష్ పెట్టుబడులు భారత దేశంలో ఉన్నంత వరకూ వారు లాభాలను భారత దేశం నుండి తరలించుకు పోతున్నందున మనం వాటిని పరిశ్రమ విస్తరణకు ఉపయోగించుకోలేము కావున భారతీయ బడా పెట్టుబడిదారులు వారితో సహకరించేవారు మనల్ని (బ్రిటిష్) సామ్రాజ్యంతో కట్టి పడేసి ఉంచినంతవరకూ అంత మేరకు పారిశ్రామికీకరణ మనం చేయలేము.

అంతేకాక నౌకాదళం, సైన్యం, పోలీసు మరి ఇతర శిక్షాత్మక అంగాలు బ్రిటిష్ సలహాదారులతో నిండి ఉన్న విషయాన్ని మనం గమనం లోకి తీసుకోవాలి.

నిజమైన స్వతంత్ర దేశం కావటానికి భారత దేశం బ్రిటిష్ సామ్రాజ్యంతో తెగతెంపులు చేసుకోవాలి, భారత ఆర్థిక వ్యవస్థపై బ్రిటిష్ పెట్టుబడుల ఆధిపత్యాన్ని అంతం చేయాలి, బ్రిటిష్ సలహాదార్లను వదిలించుకోవాలి.

అందుచేత భారత కమ్యూనిస్టు పార్టీ ఇవి అవసరం అని పరిగణిస్తున్నది:

**47.** బ్రిటిష్ కామన్వెల్త్ నేషన్స్ నుండీ, బ్రిటిష్ సామ్రాజ్యం నుండీ భారత దేశం బయటకు రావాలి.

**48.** వాటి స్వంత పేర్లతో ఉన్నా లేదా భారతీయ కంపెనీల పేర్లతో ఉన్నా భారత దేశంలో బ్రిటిష్ వారి ఆధీనంలో ఉన్న అన్ని పరిశ్రమలను, బ్యాంకులను, తోటలను (ప్లాంటేషన్లు), షిప్పింగ్ మరియు గనులను జప్తు చేయాలి, జాతీయం చేయాలి.

**49.** బ్రిటిష్ సలహాదారులను వారి పదవుల నుండి తొలగించాలి.

# భారత విదేశాంగ విధానం పునాది

భారత దేశానికి శాంతి, శాంతియుత అభివృద్ధి అవసరం. భారత దేశం అన్ని దేశాలతో శాంతి మరియు ఆర్థిక సహకారంపై ఆసక్తి కలిగి ఉంది. సమానత్వం ప్రాతిపదికన ఆర్థిక సహకారాన్ని కొనసాగించే సామర్థ్యాన్ని అది నిరూపించుకుంటే, ఈ విషయంలో బ్రిటన్ మినహాయింపు కాదు. శాంతి, యుద్ధంల మధ్య , శాంతి కాముక పక్షాలకూ, దురాక్రమణ పూరిత యుద్ధాల సమర్ధకులకూ మధ్య ప్రస్తుత భారత ప్రభుత్వం కొనసాగిస్తున్న నకిలీ నాటకం భారత దేశ ప్రయోజనాలకు తోడ్పడేది కాదు.

దురాక్రమణ పూరిత యుద్ధ సమర్ధకురాలు తన చుట్టూ దురాక్రమణ ధ్యేయంగా కల దేశాలన్నిటినీ సమీకరించిన అమెరికా సంయుక్త రాష్ట్రాలు ప్రస్తుతం శాంతికి ప్రధాన శత్రువు. ఈ యుద్ధ శిబిరం సోవియట్ యూనియన్, చైనా ప్రజాతంత్ర రిపబ్లిక్, జనతా ప్రజాస్వామిక దేశాలతో కూడి ఉన్న శాంతి శిబిరాన్ని ఎదుర్కొంటున్నది. దురాక్రమణ దారులకు వ్యతిరేకంగా, అమెరికా సంయుక్త రాష్ట్రాలను ప్రధాన దురాక్రమణ దారుగా ప్రకటించి, శాంతి కాముకులతో చేతులు కలిపే బదులు భారత దేశ ప్రభుత్వం ఈ రెండు శిబిరాల మధ్యా నకిలీ నాటకాన్ని ఆడుతోంది, అమెరికా సంయుక్త రాష్ట్రాలతో సరసాలు ఆడుతూ, శాంతి కాముక దేశాలకు వ్యతిరేకంగా దురాక్రమణదారులు చేస్తున్న యుద్ధానికి సదుపాయాలూ కల్పిస్తున్నది. భారత దేశానికి కావలసింది యుద్ధానికీ శాంతికీ మధ్య నాటకాలు ఆడటం

కాదు, శాంతి కాముక దేశాలతో ఐక్యసంఘటన కట్టడం, వాటితో స్నేహం చేయడం.

భారతదేశ ప్రస్తుత ప్రభుత్వం అడ్డుకొనని, భారత పాకిస్తాన్‌ల మధ్య కొనసాగుతున్న గొడవ భారత దేశ ప్రయోజనాల విషయంలో చాలా తక్కువ ఉపయోగకరం

భారత సమగ్ర ఆర్థిక వ్యవస్థకు దేశ విభజన వలన ఏర్పడిన అసమతుల్యత, పాకిస్తాన్, భారత దేశాల మధ్య వైరం, ప్రజలను విడదీయటానికి విప్లవ ప్రతీఘాత వర్గాలను అనుమతించటాన్ని, కాశ్మీర్ లో లాగా అమెరికా, బ్రిటిష్ సామ్రాజ్యవాదుల జోక్యానికి, ఇరు దేశాల పైనా వాటి ఆధిపత్యాన్ని అనుమతించటాన్ని, భారత పాకిస్తాన్‌ల రెండింటి మధ్యా గట్టి పొత్తుతో, పరస్పర సహకారంతో అధిగమిస్తాం. భారత దేశం, సిలోన్ (శ్రీలంక), నేపాల్ దేశాలతో కూడా స్నేహపూర్వక కూటమిలో చేరాలి.

భారత ఆర్థిక వ్యవస్థపై ఆధారపడిన, అనుబంధమైన ఆర్థికవ్యవస్థ సిలోన్ (శ్రీలంక) ఆర్థిక వ్యవస్థ. దాని ప్రజలలో చాలా పెద్ద భాగం భారత దేశం నుండి వలస వెళ్ళిన ప్లాంటేషన్ కార్మికులు (తోటపనివారు) మరియు ఇతర కార్మికులు. సిలోన్ మరియు భారత భూస్వాములూ, వర్తకులూ తమ స్వప్రయోజనాల కొరకు భారత, సిలోన్ కార్మికులను ఒకరిపై మరొకరిని రెచ్చగొడతారు. లక్షలాది మంది ప్రజలను తమ మాతృభూమి నుండి బహిష్కరించడానికి కారణమౌతున్న, ఈ దేశాలన్నిటి మధ్యా వైషమ్యాన్ని నాటడానికి, వాటి ప్రజల మధ్య ద్వేషాన్ని విత్తడానికి ఈ దేశాల మధ్య పొత్తు లేక పోవడాన్ని సామ్రాజ్యవాదులూ, వారి తాబేదారులూ ఉపయోగించుకుంటున్నారు. సామ్రాజ్యవాదుల, ఈ దేశాల విప్లవ ప్రతీఘాత పాలక వర్గాల ఆటను బలమైన పొత్తు, స్నేహం మాత్రమే కట్టడిచేయగలదు (ఓడించగలదు).

అందుచేత ఈ క్రింది వాటికి హామీ ఇవ్వడం అవసరమని భారత కమ్యూనిస్టు పార్టీ పరిగణిస్తున్నది:

**50.** శాంతిని ప్రేమించే అన్ని దేశాల పొత్తులో, దురాక్రమణదారులకు వ్యతిరేకంగా వారితో ఐక్యసంఘటన ద్వారా నిజాయితీతో కూడిన స్థిరమైన శాంతి విధానం.

**51.** పూర్తి సమానత్వం ఆధారంగా ఎటువంటి వివక్షతా లేకుండా ఆర్థిక సహకారాన్ని కొనసాగించగల సామర్థ్యం గల అన్ని దేశాలతో ఆర్థిక సహకార విధానం.

**52.** పాకిస్తాన్, సిలోన్, నేపాల్‌లతో కూటమి మరియు స్నేహం కొనసాగించే విధానం.

**53.** విదేశాలలోని భారతీయుల చట్టబద్ధమైన హక్కులను, ప్రయోజనాలను రక్షించడానికి గరిష్ఠంగా చేయగలిగినదంతా చేసే విధానం.

వారు ఏ లక్ష్యం కోసం పోరాడుతున్నారు అనే విషయంపై పూర్తి అవగాహన కలిగి ఉండటానికి వీలుగా భారత కమ్యూనిస్టు పార్టీ ఈ కార్యక్రమాన్ని భారత ప్రజల ముందు ఉంచుచున్నది.

దేశ స్వాతంత్ర్యం పట్ల, మన దేశానికి పూర్తి స్వాతంత్ర్య సాధనకు ఒకే ఒక ఐక్య సంఘటనగా అభివృద్ధి చెందటానికి అనువైన సంపన్న జీవితం అభివృద్ధి కోసం, భూస్వాముల నుండి రైతాంగ విముక్తి కోసం, శ్రమజీవుల పని పరిస్థితులలో మెరుగుదలకు, మన వ్యవసాయంలో గొప్ప ముందడుగు తీసుకు రావడానికి, దేశీయ పరిశ్రమల అభివృద్ధిలో గొప్ప ముందడుగు తీసుకు రావడానికి, మన దేశ సాంస్కృతిక ప్రగతిని సురక్షితం చేయటానికి, శ్రమ జీవులైన లక్షలాది మంది కార్మికవర్గం వారికి, రైతాంగానికి, బుద్ధి జీవులకు, మధ్య తరగతి వారికి అలాగే ఆసక్తి గల జాతీయ బూర్జువా వర్గానికి కూడా భారత కమ్యూనిస్టు పార్టీ పిలుపునిస్తున్నది.

కార్మిక వర్గం, దాని కమ్యూనిస్టు పార్టీల నాయకత్వం లోని భారత ప్రజలు మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్ ల బోధనల మార్గదర్శకంలో మన మాతృభూమి లోని లక్షలాది రైతులతో గట్టిగా కలిసి ఈ కార్యక్రమాన్ని సాధిస్తారు. మార్క్సిస్టు సూత్రాలు, తత్వశాస్త్రం, కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం మానవావళిలో సగం మందిని సోషలిజం వైపు, స్వేచ్ఛ వైపు, నిజమైన ప్రజాస్వామ్యం వైపు నడిపాయి, దానికి మకుటాయమానంగా సోవియట్ యూనియన్ నిలిచింది. ఆసియా ప్రజలు మహత్తర చైనా జనతా ప్రజాస్వామికం నాయకత్వంలో ఇప్పుడు సామ్రాజ్యవాదం నుండి విముక్తి కొరకు పోరాడుతున్నారు. దోచుకోడానికి, దోపిడీ చేయడానికి బానిస యజమానుల చేతుల్లో మిగిలి ఉన్న ఆసియా లోని అతి పెద్ద పరాధీన అర్ధ

వలస దేశం భారత దేశం.  విజయవంతమైన జనతా ప్రజాస్వామ్యంగా ప్రపంచంలోని గొప్ప దేశాల సరసన తన స్థానాన్ని భారత దేశం సాధించుకుంటుందని, శాంతి, శ్రేయోరాజ్యం, ఆనందాల రహదారిని పడుతుందని కమ్యూనిస్టు పార్టీ నమ్ముతున్నది.

అనువాదం: యార్లగడ్డ వెంకట రావు.

*****

# 1951 Program Document of Communist Party of India

From Documents of the History of the Communist Party of India
Vol VIII 1951-1956
Edited by Mohit Sen
